ప్రజాశక్తి
మంగళవారం 19 నవంబరు, 2024
5
శ్రీకాకుళం

ఎఎస్‌పి బాధ్యతల స్వీకరణ

బాధ్యతలను స్వీకరిస్తున్న రమణ

శ్రీకాకుళం: అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా కె.వి రమణ జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయన ఛాంబరులో సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి జి.సీతారామరావు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయ పనితీరును పర్యవేక్షించాలని, కార్యాచరణతో ఎటువంటి కాలయాపన లేకుండా పోలీస్ సిబ్బందికి సంబంధించి పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని ఎస్‌పి తెలిపారు. ఎఎస్‌పి రమణను పలువురు పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఒప్పంద జిఒలు అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్ల ధర్నా

ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పోరాట ఫలితంగా గతంలో ప్రభుత్వం ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రతినిధి బృందంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలు, సర్క్యులర్లను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ధనలక్ష్మి, జి.అమరావతి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో సోమవారం ఆర్అండ్‌బి బంగ్లా రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపుదల జిఒను వెంటనే వర్తింపజేయాలన్నారు. జిఒ వచ్చేంత వరకు 60 ఏళ్లు నిండిన వారికి రిటైర్మెంట్ ఆపాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఆశావర్కర్ల విధులకు అవసరమైన రికార్డులు, పనిచేసే సెల్‌ఫోన్లు ఇవ్వాలన్నారు. అకాల మరణం పొందితే మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. ఎఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు వెయిటేజీ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేసి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యాప్‌ల భారం తగ్గించి ఒత్తిడి లేని విధులు అప్పగించాలన్నారు. ప్రభుత్వ సెలవులను ఆశాలకూ వర్తింపజేయాలని కోరారు. 21 రికార్డుల ఒత్తిడిని తగ్గించాలన్నారు. అదనపు పనులకు అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో నెలకు కేవలం రూ.4 వేలు వేతనం ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వారిని ఆశాలుగా గుర్తించి వేతనాలు చెల్లించాలన్నారు. ఆశాలు గర్భిణులకు ఆస్పత్రులకు తీసుకెళ్లేటప్పుడు దారి ఖర్చులు ఇవ్వాలన్నారు. జనాభా ప్రాతిపదికన ఆశాలను నియమించాలని, ఖాళీ ఉన్నచోట వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన అదనపు డిఎంహెచ్ఒ బి.సత్యవాణికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.లావణ్య, స్వర్ణలత, దమయంతి, సుజాత, గౌరమ్మ, జ్యోత్స్న పాల్గొన్నారు.

అపార్ నమోదు విద్యార్థికి కీలకం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అపార్ నమోదు విద్యార్థికి అత్యంత కీలకమని, అపార్ ఐడిల నమోదు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అపార్ నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 114 ఉండగా అపార్ నమోదు తక్కువ గా ఉందన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో 1277 మంది బాలికల అపార్ నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అపార్ ఐడిలు జనరేట్ చేసేందుకు అవసరమైన ఆధార్, జనన తేదీ, స్కూల్ సర్టిఫికేట్ల మధ్య వ్యత్యాసాన్ని సరిదిద్దుకోవాలన్నారు. ఆధార్ ధ్రువీకరణలో లోపాలను సరిచేసేందుకు సమయం పడుతోందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు అపార్ నమోదు ప్రక్రియ 80 శాతం పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మిగిలిన 20 శాతం పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐఒ దుర్గారావు, డివిఇఒ తవిటినాయుడు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, డిఇఒ తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

108ను ప్రభుత్వమే నిర్వహించాలి

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

108 అంబులెన్స్ వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని 108 సేవల కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్ మోహన్ డిమాండ్ చేశారు. 108లో విధులు నిర్వహిస్తున్న ఇఎంటి, పైలట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్ ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మోహన్ మాట్లాడుతూ 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థల మార్పు జరిగిన ప్రతిసారీ ఉద్యోగుల గ్రాట్యుటీ, ఇఎల్ అమౌంట్ చెల్లించకుండానే వైదొలగడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. 2017లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన 49 జిఒ ద్వారా 108లోని ప్రతి ఉద్యోగికి ప్రతి నెలా రూ.నాలుగు వేలు నేరుగా చెల్లించేవారని, గత ప్రభుత్వం దాన్ని రద్దు చేసి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ జిఒను పునరుద్ధరించాలని కోరారు. వైద్యారోగ్యశాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డి.ఎం.ఇ) ద్వారా అన్ని వైద్య కళాశాలల్లో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇ.ఎం.టి) పోస్టులకు నిర్ధారించిన విద్యార్హత కలిగిన అభ్యర్థులు భర్తీ కావడం లేదన్నారు. విద్యార్హతలు సడలించి 108 సర్వీసులో ఇప్పటికే ఇఎంటిలుగా పనిచేస్తున్న వారి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎఐఎంఎస్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, దాన్ని నివారించి సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే ఈనెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని చెప్పారు. ధర్నాలో 108 కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు, నాయకులు ఈశ్వర్, శ్రీను, మురళి, చిన్నబాబు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని సత్కరిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

గ్రంథాలయాలకు మౌలిక వసతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు సాయమందిస్తానని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎర్రన్న విద్యా సంకల్పం ద్వారా జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల బీరువాతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సోమవారం అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి గ్రంథాలయ ఉద్యమ పితామహులతో పాటు ఎర్రన్నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రస్తుత పరిస్థితుల్లో గ్రంథాలయాలకు వచ్చి చదవుకోవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తకాలు చదివి ప్రభుత్వ పోటీ పరీక్షల్లో విజయాన్ని అందుకోవాలన్నారు. గ్రంథాలయ ఉత్తమ పాఠకులు ఎం.చంద్రశేఖర్, జి.గోవిందరావు, కె.చిరంజీవులు, ఎన్.ఛాయారతన్, కాళ్ల రాజు, ఎస్.వి రమణమూర్తిని సత్కరించారు. అనంతరం కేంద్రమంత్రికి గ్రంథాలయ ఉద్యోగులు సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా, టిడిపి నాయకులు ఎం.దాసునాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు

● కలెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘాల వినతి ● 'మీకోసం'కు 73 వినతులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాఠశాల విద్యాశాఖ, కళాశాలల స్థాయిలో చదువుతున్న విద్యార్థులకు అపార్ కార్డుల జారీలో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించకుండా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం సరికాదని యుటిఎఫ్ నాయకులు ఎస్.కిషోర్‌కుమార్, వై.ఉమాశంకర్, డిటిఎఫ్ నాయకులు కె.రమణమూర్తి, రమేష్, ఎపిటిఎఫ్ నాయకులు మజ్జి మదన్మోహన్, టి.మురళీమోహనరావు తదితరులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వినతులు స్వీకరించారు. నాగావళి నదిలో యంత్రాలను ఉపయోగించి పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతూ వ్యాపార అవసరాలకు విశాఖపట్నంకు ఇసుక తరలిస్తున్నారని, దీనివల్ల ఉచిత ఇసుక లక్ష్యం దెబ్బతింటోందని ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి ఫిర్యాదు చేశారు. నాగావళి నది పక్కనే ఉన్న ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ వెంకన్నపేటలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నాలుగు రోజుల కిందట ఉద్యోగులపై అనుచితంగా ప్రవర్తించి దుర్భాషలాడిన ఉపాధ్యాయుడు టి.శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిఇఒ కార్యాలయ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. డిఇఒ తిరుమల చైతన్యకు ఘన జరిగిన వెంటనే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తక్షణమే ఉపాధ్యాయునిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అతనిపై కేసు నమోదు చేయాలని వన్‌టౌన్ పోలీసులను జెసి ఆదేశించారు. వాకలవలసలోని జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ పలువురు మహిళలు వినతిపత్రాలను అందజేశారు. వీటితోపా వ్యక్తిగత, సామాజిక అవసరాలు పరిష్కరించాలని కోరుతూ 73 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజు, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డిసిహెచ్ఎస్ కళ్యాణ్ బాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

క్రిమినల్ కేసులపై

ప్రత్యేక దృష్టి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

వచ్చే నెల 14వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీసు, ఎక్సైజ్, కార్మిక, విద్యుత్ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను ఎక్కువగా రాజీ చేయాలని కోరారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.ఎల్.వి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A.153/2024 in O.S.215/2018

Between:-
Ruppa Mangamma & Another
....Petitioners/D-2,D-3
And:-
Mannem Mahalaxmi & Others
...Respondents/Plaintiff/D-1
R-1. Mannem Mahalaxmi, W/o Sateesh, Aged 40 years, household duties, Bavajinagar, Balaga, srikakulam town
R-2. Dunga Krishna @Polayya, S/o late Chalamayya,aged 62 years, Gunapalem Street, srikakulam town and district

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల **IA153/2024 in OS.215/2018** దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 20-11-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

పి.యస్. గాంధీ
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9848063543.

మహారాజశ్రీ శ్రీకాకుళం ఎడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
OS.No: 48/2024

Between:-
శ్రీ శ్రీ ఫలహారి మహంతి లక్ష్మీదర్‌దాసు బావాజీ పీఠాధిపతి, బావాజీ మఠం, బొందిలీపురం, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా. .....వాది
And:-
తాంద్ర గోవిందరావు మరియు ఇతరులు
....ప్రతివాది

నోటీసు

D-3: నక్క కోదండ రమణ @ రాము, S/o తిరుపతిరావు, లేబర్ మేస్త్రి, పి.ఎన్ కాలనీ, 2వ లైన్, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా.
D-4: నక్క రామప్రసాదరావు, S/o లేటు త్రినాధరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం, కొత్త బ్రిడ్జి జంక్షన్, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా.
D-5: పైడి ప్రకాశరావు, S/o లేటు కృష్ణమూర్తి, రియల్ ఎస్టేట్ వ్యాపారం, కృష్ణాపురం గ్రామం, ఆమదాలవలస మండలం శ్రీకాకుళం జిల్లా.

మీపై వాది పైకోర్టులో ఇంజక్షన్ దావా వేచి ఉన్నారు. మీకు కోర్టు వారు సమన్లు జారీ కోసం పలుమార్లు బెట్టా కట్టుననూ ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారు మీకు సమన్లు జారి నిమిత్తం ఈ పేపర్ ద్వారా తెలియజేయడమైనది. మీ హాజరు నిమిత్తం పై దావా **OS. 48/2024 ఈనెల 29-11-2024 వాయిదా వేయడమైనది.** అందువలన మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని **తేదీ 29-11-2024 ఉ॥ 10:30 గం॥లకు** హాజరు కాగలరు. లేని పక్షంలో మీ పరోక్షమున పై దావా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

కంచరాని నాగభూషణరావు
అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్: 9440149767

విద్యార్థినులు, సభ్యులతో కేంద్రమంత్రి

కొత్త ఎయిర్‌పోర్టులతో ఉద్యోగావకాశాలు

కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భోగాపురం, జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఎయిర్‌పోర్టులతో మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా ఆధ్వర్యాన స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉమెన్ ఏవియేషన్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలు ఎక్కడ ఉన్నా కష్టపడి పనిచేసే లక్షణం ఉన్న వారని, మరింత నైపుణ్యం జోడిస్తే రాణించగలరన్నారు. ఉన్నత కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బేటీ కీ ఉడాన్... దేశ్‌కా స్వాభిమాన్ అనేది విమానయాన శాఖ ధ్యేయమని, యువతులను విమానయాన శాఖలోని మరిన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పైలెట్, ఎయిర్ హోస్టెస్, కస్టమ్స్, ఇంజినీరింగ్, ఇమ్మిగ్రేషన్ సహా ఎన్నో విభాగాల్లో మహిళలకు అవకాశాలున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా కేవలం ఐదు శాతం మంది మాత్రమే మహిళా పైలెట్లు ఉన్నారని చెప్పారు. ఈ వాటాని 25 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థినులను విమానయాన రంగం వైపు ప్రోత్సహించేలా వినూత్న కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు కమల చక్రవర్తి, సభ్యులు అంజలి చౌహాన్, అర్చన, కీర్తి తివారి తదితరులను సత్కరించారు. అంతకుముందు ఎన్‌సిసి విద్యార్థినుల గౌరవ కవాతును స్వీకరించారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా గాంధీ విగ్రహం వద్ద మొక్క నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, టిడిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు పాల్గొన్నారు.

మహారాజశ్రీ శ్రీకాకుళం ఎడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
IA.No: 167/2024 in OS.No: 48/2024

Between:-
శ్రీ శ్రీ ఫలహారి మహంతి లక్ష్మీదర్‌దాసు బావాజీ పీఠాధిపతి, బావాజీ మఠం, బొందిలీపురం, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా. .....వాది
And:-
తాంద్ర గోవిందరావు మరియు ఇతరులు
....ప్రతివాది

నోటీసు

D-3: నక్క కోదండ రమణ @ రాము, S/o తిరుపతిరావు, లేబర్ మేస్త్రి, పి.ఎన్ కాలనీ, 2వ లైన్, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా.
D-4: నక్క రామప్రసాదరావు, S/o లేటు త్రినాధరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం, కొత్త బ్రిడ్జి జంక్షన్, శ్రీకాకుళం పట్టణం మరియు జిల్లా.
D-5: పైడి ప్రకాశరావు, S/o లేటు కృష్ణమూర్తి, రియల్ ఎస్టేట్ వ్యాపారం, కృష్ణాపురం గ్రామం, ఆమదాలవలస మండలం శ్రీకాకుళం జిల్లా.

మీపై వాది పైకోర్టులో ఇంజక్షన్ దావా వేచి ఉన్నారు. అంతే కాకుండ టెంపరరీ ఇంజక్షన్ పిటిషన్ **IA. 167/2024** కూడా వేసియున్నారు. మీకు సమన్లు ఎన్ని సార్లు జారీ చేసిననూ ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారు మీకు సమన్లు నిమిత్తం ఈ పేపర్ ద్వారా తెలియజేయడమైనది. మీ హాజరు నిమిత్తం పై దావా మరియు **IA.167/2024 in OS.48/2024 తేదీ 29-11-2024 వాయిదా వేయడమైనది.** అందువలన మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని పై దావాలో మరియు **IA.167/2024 in OS.48/2024 తేదీ 29-11-2024 ఉ॥ 10:30 గం॥లకు** పైకోర్టులో హాజరు కాగలరు. లేని పక్షంలో మీ పరోక్షమున పై దావా **OS.48/2024** మరియు **IA.167/2024 in OS.48/2024** తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

కంచరాని నాగభూషణరావు
అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్: 9440149767

మహారాజశ్రీ శ్రీకాకుళం 4వ అదనపు జిల్లా మరియు SC&ST జడ్జ్ వారి కోర్టులో
IA.No:485/2023 in OS.No: 75/2017

Between:- **వడ్డి వెంకట విశ్వేశ్వరరావు వగైరాలు**
.....పిటీషనర్లు/వాదులు
And:- **బూర్లె యర్రయ్య వగైరాలు**
.....రెస్పాండెట్లు/ప్రతివాదులు

To,
R-23: గొటివాడ సుశీల, D/o గొటివాడ లేటు రామయ్య, సా॥ డోర్ నెం: 15-7, చోడవరం గ్రామం, నరసన్నపేట మండలం, శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుతం సా॥ కిష్టుపురం గ్రామం, కోటబొమ్మాళి మండలం.
R-26: గొటివాడ సూరిడమ్మ, D/o లేటు గొటివాడ రామయ్య, ---Rest do--- ప్రస్తుతం సా॥ ఒంగోలు టౌను మరియు మండలం, ప్రకాశం జిల్లా.
R-27: గొటివాడ రమణమ్మ, D/o లేటు గొటివాడ రామయ్య, ---Rest do--- ప్రస్తుతం శ్రీకాకుళం టౌన్ మరియు జిల్లా.
R-28: గొటివాడ మందారమ్మ, D/o లేటు గొటివాడ రామయ్య, ---Rest do--- ప్రస్తుతం సా॥ ఒంగోలు టౌను మరియు మండలం, ప్రకాశం జిల్లా,
R-29: గొటివాడ ఆదిలక్ష్మి, D/o లేటు గొటివాడ రామయ్య, ---Rest do--- ప్రస్తుతం సా॥ కరవంజి గ్రామం, జలుమూరు మండలం.
R-30: గొటివాడ అప్పన్న, S/o లేటు గొటివాడ రామయ్య, ---Rest do--- ప్రస్తుతం సా॥ ఒంగోలు టౌను మరియు మండలం, ప్రకాశం జిల్లా .

పై నెంబరు దావాలో 7న ప్రతివాది అయిన గొటివాడ రామయ్య కాలం చేసినందున అతనికి మిమ్ములను వారసులుగా నిర్ణయించి దావాలో 23,26 నుండి 30 ప్రతివాదులుగా చేర్పించమని కోరుచు పిటీషనరులు పై నెంబరు పిటిషను దాఖలు చేసినందున యిందు విషయమై మీకు గల ఆక్షేపనలు **తే॥ 29-11-2024 దిని ఉ 10.30 గం॥ లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా కాని మీ లాయరు గారి ద్వారా కాని హాజరై తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు Ex-parte తీర్మాణం జరపడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

// By orders of the court//

డి. సరళ కుమారి
న్యాయవాది
శ్రీకాకుళం, సెల్: 8247600229.

కరాటేలో క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన అంతరరాష్ట్ర కరాటే పోటీల్లో నగరానికి చెందిన సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు సత్తా చాటారు. 8 మంది స్వర్ణ, ఆరు రజిత, పది కాంస్య పతకాలు సాధించారు. విజేతలకు వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పతకాల సాధనకు కృషి చేసిన శిక్షకులు వై. హేమంత్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, పూర్వ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, వాకర్స్ సంస్థ జిల్లా కార్యదర్శి సంజీవరావు, ఎస్.జోగినాయుడు, లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్ తదితరులు క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్, శిక్షకులు విజయకుమార్, డి.హరీష్‌లకు జ్ఞాపికలను అందజేశారు.


ట్రోఫీని అందజేస్తున్న వేణుగోపాల్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'స్వచ్ఛ భారత్' లక్ష్యాలను సాధించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: ప్రతి కుటుంబానికీ సురక్షిత తాగునీరు జల్ జీవన్ మిషన్ ద్వారా అందించడమే లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్, వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ అంశాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో సోమవారం సమీక్షించారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం పంచాయతీరాజ్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా భూగర్భ జలాలు పెంచే నిర్మాణాలు, కట్టడాలు చేపట్టాలన్నారు. జిల్లా పరిషత్ ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులతో పైపులైన్లు, నీటి శుద్ధి యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే బస్, రైల్వేస్టేషన్లు, ఆస్పత్రులు, బహిరంగ ప్రదేశాలు, దేవాలయాలు తదితర ప్రదేశాల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎహసాన్ భాషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిపిఒ కె.భారతి సౌజన్య, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు కిరణ్ కుమార్, సుధాకర్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డిపిఆర్ఒ కె.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడపై ఫిర్యాదు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన పార్టీ టెక్కలి ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. 2019-2024 మధ్య కాలంలో దువ్వాడ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిష్టకి భంగం కలిగేలా, జన సైనికుల మనోభావాలు దెబ్బతినేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ వివాహాలపై, వ్యక్తిగత జీవితాలపై సభ్య సమాజం సిగ్గుపడేలా దువ్వాడ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను పెన్‌డ్రైవ్‌లో పొందుపరచి ఫిర్యాదుతో పాటు అందజేసి, దువ్వాడపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని స్టేషన్ సిబ్బంది జనసేన నాయకులకు తెలిపారు.


ఫిర్యాదు చేస్తున్న కిరణ్‌కుమార్

అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పూర్తిస్థాయిలో ఫిర్యాదులు పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో భాగంగా అర్జీదారులు అందించిన ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (మీకోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి 50 వినతులు స్వీకరించారు. వృద్ధులు, వికలాంగుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదుల చర్యలపై నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలన్నారు.

డిఎంహెచ్‌ఒను కలిసిన వైద్య ఉద్యోగులు

ఎఎన్‌ఎంలకు పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పని ఒత్తిడి పెరిగిందని, అందువలన ఉన్నతాధికారుల ఆదేశానుసారం రీ డిప్లాయ్‌మెంటును ఉపసంహరించుకుని ఎఎన్‌ఎంలను యదాస్థానాలకు పంపించాలని తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.మీనాక్షిని కలిసి వినతిపత్రం అందజేశారు. శాఖాపరంగా అనేక ప్రోగ్రాంలను క్షేత్ర స్థాయిలో ఎఎన్‌ఎంలు అందిస్తున్నారని, వారికి పనిభారం పెరిగిందని గుర్తుచేశారు. వారికి ఇతర పనులను అప్పగించకుండా ఎంపిడిఒలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. డిఎంహెచ్‌ఒను కలిసిన వారిలో సంఘం నాయకులు పి.మోహనరావు, కె.వి.రమనమూర్తి, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

24, 25న యుటిఎఫ్ మహాసభలు

ప్రజాశక్తి- నందిగాం

ఈ నెల 24 25న మందస మండలం హరిపురంలో యుటిఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కేదాలయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని నర్సిపురం, దేవలభద్ర, లఖిదాసుపురం, నౌగాం, తురకలకోట, మందనాపురం, కెజిబివిను సోమవారం సందర్శించారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శంకరరావు, టెక్కలి మండల ప్రధాన కార్యదర్శి టి.వైకుంఠరావు, సీనియర్ కార్యకర్త పి.ధర్మారావు, నందిగాం అధ్యక్షులు కె.కుమారస్వామి పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న డాక్టర్ అన్వేష్, వాసంతి

ముందస్తు జననంపై ఆందోళన వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గర్భం దాల్చి 37 వారాల ముందు జన్మించిన శిశువును ముందస్తు శిశువుగా పరిగణించవచ్చునని, దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని లిటిల్ మాస్టర్స్ చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులు నియోనటాలజిస్ట్ డాక్టర్ అమితి అన్వేష్, స్వాతి వాసంతి తెలిపారు. వరల్డ్ ప్రీమెచ్యూరిటీ డే సందర్భంగా లిటిల్ మాస్టర్స్ చిల్డ్రన్స్ ఆస్పత్రి డయాగ్నిస్టిక్ సెంటర్‌లో ముందస్తుగా జన్మించిన చిన్నారుల తల్లిదండ్రులకు వారు అవగాహన కల్పించారు. నవజాతి శిశువులు సాధారణంగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారని, ప్రీమెచ్యూరిటీ శిశువులు చాలా తెలివైన వారై ఉంటారని, వారిలో ఐక్యూ లెవిల్స్ కూడా సాధారణ శిశువుల కంటే అధికంగా ఉంటాయన్నారు. లెవెల్ – 4 చిన్నారులు సాధారణంగా రెండు కేజీల కంటే తక్కువ బరువు కలిగి ఉంటారన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితుల్లో జన్మించిన శిశువులకు విశాఖపట్నం తరలించాల్సి వచ్చేదని, ఇప్పుడు తమ ఆస్పత్రిలోనే మెరుగైన వైద్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'అన్న క్యాంటీన్'పై తప్పుడు ప్రచారం చేయొద్దు

ప్రజాశక్తి- పలాస

గత ఐదేళ్లపాటు అన్యాయానికి, అక్రమానికి ఊడిగం చేయడానికి అలవాటు పడిపోయిన కొంత మంది... కూటమి ప్రభుత్వం చేపడుతున్న మంచి పనులను జీర్ణించుకోలేక బురద చల్లేందుకు కుట్రలు పన్నుతున్నారని ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు కాశీబుగ్గలోని అన్న క్యాంటీన్ నిర్వహణ తీరు తెన్నులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.5కే మూడు ఇడ్లీ, రూ.5కే మూడు పూరీలను అందిస్తున్నారని, ఇంకా అవసరమైన వారు మరో రూ.5 పెట్టి కొనుగోలు చేసుకుంటున్నారని అన్నారు. అంతే తప్ప ఇక్కడ హాఫ్, ఫుల్ అనే అంశాలకు తావు లేదని స్పష్టం చేశారు. సేవా దృక్పథంతో పేదల కడుపు నిండాలనే ప్రధాన ఉద్దేశంతో సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారని వివరించారు. ఎమ్మెల్యేపై, కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు కుట్రలు పడున్నారని అన్నారు.

టిఫిన్ చేస్తున్న బాబూరావు

గ్రంథాలయాల్లో క్విజ్ పోటీలు

లావేరు : పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం: బలగ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అధికారి పి. ఉగ్రసేను ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్, పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో శరత్, రాజేష్, సహాయకులు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

లావేరు: లావేరు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించారు.

పొందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే మ్యూజికల్ చైర్ గేమ్, ఇతర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రంథాలయాధికారి కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వార్షికోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జయలక్ష్మి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బూర్జ: క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగం పోటీలు గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, మహిళా పోలీస్ నీలిమ, నలంద స్కూల్ ఉపాధ్యాయులు శారద పాల్గొన్నారు.

నేడు అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉన్న హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్టు ఆలయ ఇఒ వై.భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులు, అనువంశిక దర్మకర్తల పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లతో పాటు పంచాయతీల పరిదిలో మంగళ వారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు తాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లీసుపురం సమీపాన బొందిలీపురం చేపల మార్కెట్ వద్ద తాగునీటి సరఫరా అవుతున్న 600 ఎంఎం మెయిన్ పంపింగ్ లైన్ మరమ్మతుకు గురైనట్టు తెలిపారు. నగర ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పాతపట్నం : ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని పాతపట్నం సిఐ వి.రామారావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనం దినచర్యగా అలవాటు చేసుకోవాలన్నారు. అన్ని తరగతి ప్రజలు పుస్తకాలు చదివి మేధోశక్తిని పెంపొందించుకోవాలన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని హితవు పలికారు. పోటీ ప్రపంచానికి ధీటుగా విశాలాంధ్ర చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. విశాలాంధ్ర మొబైల్ బుక్ హౌస్ ఇన్‌ఛార్జి నజీర్ మాట్లాడుతూ ఈ సంచార పుస్తకాలయం మూడు రోజులపాటు పాతపట్నం మండల కేంద్రంలో కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి యడ్ల గోపి, విశాలాంధ్ర నిర్వాహకులు ఎల్.శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల సముదాయాలు

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పాత విధానం ప్రకారం రెండు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు ఒక మండలంలో సముదాయాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. సముదాయాలు నిర్వహించే రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని గట్టి ఆదేశాలను ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖాధికారులు జారీ చేశారు. సబ్జెక్టు కాంప్లెక్స్‌ల్లో భాగంగా మంగళవారం తెలుగు, గణితం, జీవశాస్త్రం, వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించనున్నారు. బుధవారం రసాయనికి శాస్త్రం, ఆంగ్లం, హిందీ, సోషల్ సబ్జక్టులకు సముదాయాలు నిర్వహించే విధంగా ప్రణాళిక తయారు చేశారు. ఈ నెలకు సంబంధించిన సముదాయాలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

పలాస: వచ్చే నెల 14న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలాస, కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జిలు యు.మాధురి బి.ఎం.ఆర్.ప్రసన్నలతలు అన్నారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ప్రతినిధులతో, న్యాయవాదులతో సోమవారం సమీక్షించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్‌గా వ్యవహరించిన కోటబొమ్మళి జడ్జి ప్రసన్నలత పలాస జడ్జి యుమాధురికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే జాతీయ లోక్ అదాలత్‌కు సహకరించాలని న్యాయవాదులను కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, సెక్రెటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రెటరీ అనిల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనారాయణ, తాండ్ర మురళీమోహన్, కోత రజినికుమార్, జి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న గాంధీ

ప్రజాధనం దుర్వినియోగంపై ఫిర్యాదు

ఆమదాలవలస: మండలంలోని చింతలపేట పంచాయతీ దండేవలసలో సుమారు రూ.కోటితో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలు నిర్మించారని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చింతలపేటకు కార్యాలయాలను తరలించారని, దీంతో ప్రజాధనం దుర్వినియోగమైందని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం ప్రజల సౌలభ్యం కోసం చింతలపేట, బొబ్బిలిపేటకు మధ్య సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించి ఏడాది పాటు సేవలందించగా నేడు ఆ భవనాలను మూసివేయడంతో ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ కార్యకలాపాలను యధావిధిగా దండేవలసలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. ఈయనతో పాటు చింతాడ మోహన్, అప్పారావు, సూర్య నారాయణ, బొడ్డేపల్లి అప్పలసూరి, ముల్లు ధర్మారావు, పైడి విజయ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

జెడ్‌పి ఎదుట కెవిపిఎస్, వ్య.కా.స ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కోటబొమ్మాళి మండలం కిష్టపురం గ్రామ దళితులు చల్ల దమయంతి, చల్ల అప్పలరాజులపై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగి గన్నయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై దాడి జరిగి నెల రోజులు కావస్తున్నా నేటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సొంత మండలంలో దళితులపై దాడి ఘటనపై స్పందించక పోవడం బాధాకరమన్నారు. కోటబొమ్మాళి ఎస్ఐ రాజకీయ ఒత్తిళ్లకు తలవంచి బాధిత దళితులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దళితులకు జరిగిన అన్యాయాన్ని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు న్యాయం జరగలేదని, తక్షణమే ఈదాడి ఘటనపై కేసులు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ధర్మాన శ్రీను, ధర్మాన ప్రసాదరావు వారి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళితులను ఐక్యం చేసి ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో బాధితురాలు చల్ల దమయంతి, చల్ల అప్పలరాజుతో పాటు కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భవిరి కృష్ణమూర్తి, కాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెసి ఫర్మాన్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ధర్నా చేస్తున్న కిష్టపురం బాధితులు

కొజ్జిరియాలో వైద్య బృందం పర్యటన

సర్వే చేస్తున్న వైద్య బృందం

కవిటి: మండలంలోని కొత్త కొజ్జిరియాలో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యాన వైద్య బృందం సోమవారం పర్యటించింది. ఇటీవల గ్రామంలో కీళ్ల నొప్పులు, జ్వరాలతో ఎక్కువ మంది బాధపడుతున్నామంటూ ఎమ్మెల్యే అశోక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మీనాక్షికి స్థానికుల ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వైద్యాధికారి, ఎమ్మెల్యే అశోక్ తక్షణమే స్పందించారు. యాంటీ లార్వా ఆప్రేషన్, ఫాగింగ్ చేయించింది. స్థానిక పిహెచ్‌ఎ వైద్యాధికారి డాక్టర్ పి.రాకేష్ అధ్యక్షతన మెడికల్ క్యాంపు, ఇంటింటికీ సర్వే నిర్వహించింది. ఈ క్యాంపులో 9 మంది జ్వరపీడుతులను గుర్తించి మలేరియా, డెంగి పరీక్షలు నిర్వహించారు. వీటిలో నాలుగు సీర శాంపిల్స్ చికెన్ గున్యా పరీక్షల కోసం రిమ్స్ కోసం పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి నిల్వలు, కాలువల్లో మురుగు పేరుకుపోవడమే వ్యాధులకు ప్రధాన కారణమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి నల్లాన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, ఎఎన్‌ఎంలు ప్రతి శుక్రవారమూ డ్రై డే రోజు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ మలేరియా అధికారి శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ డి.కవిత, ల్యాబ్ ఇన్‌ఛార్జి శివప్రసాద్, ఎంటిఎస్ ఎస్.నాగేష్ పాల్గొన్నారు.

ఒడియా పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి- కవిటి

ఐటిడిఎ పరిధిలో కంచిలి, సోంపేట, మందస మండలాల్లోని మూడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమిక ఒడియా మాధ్యం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల్లో ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని అపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పాడి, ప్రధాన కార్యదర్శి బందావన్ దొలై కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి రాష్ట్ర గిరిజన శిశు మహిళా సంక్షేమశాఖ మంత్రి జి.సంధ్యారాణిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పై పాఠశాలల్లో ఒడియా సిఆర్‌టిలను నియమించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఒడియా విద్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని, 2012, 14, 18లో నిర్వహించిన డిఎస్‌సిలో నోటిఫై చేయని 34 ఒడియా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను వచ్చే డిఎస్‌సి ద్వారా భర్తీ చేసి గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులను భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 13 మంది కాంట్రాక్టు బేసిక్ ఒడియా ఉపాధ్యాయులను నియమించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న అపోటా ప్రతినిధులు

పాత్రికేయులది ప్రత్యేక స్థానం

మాట్లాడుతున్న ప్రకాష్

కవిటి: సమాజంలో పాత్రికేయులది ప్రత్యేక స్థానమని, ఒక అంశాన్ని సామాన్యుడు చూసే కోణానికి, పాత్రికేయుడు చూసే కోణానికి తేడా ఉంటుందని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. జాతీయ పత్రిక వారోత్సవాలు సందర్భంగా బొరివంక ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయ రంగాన్ని నాలుగో స్తంభం అంటారని, విలువలతో కూడిన పాత్రికేయ వృత్తి ప్రపంచాన్నే శాసించగలదని అన్నారు. సర్పంచ్ బెందాళం శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలన్నారు. వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు లోట్ల దీనబంధు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ పూడి నేతాజీ, ఎంపిటిసి దుద్ది సతీష్ కుమార్, బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్.పి.నారాయణస్వామి, బెందాళం మోహనరావు, గెస్ట్ శంకరరావు పాల్గొన్నారు.

పురుషుల కోసం ఓ రోజు

నేడు అంతర్జాతీయ మెన్స్ డే

ప్రజాశక్తి- రణస్థలం

మహిళా దినోత్సవం కోసం చాలా మందికి తెలుసు. అయితే పురుషులకు కూడా పురుషుల దినోత్సవం ఎప్పుడో తెలియదు. నవంబర్ 19 మంగళవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవం. 1991లో పురుషుల దినం కోసం ప్రస్తావన జరగ్గా 1992లో తొలిసారిగా 'ఇంటర్నే షనల్ మెన్స్ డే' నిర్వహించారు. దీనిని ప్రొఫెసర్ థామస్ ఓస్టర్ ప్రారంభించారు. 1994 వరకు మెన్స్ డే సక్రమంగానే జరిగినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా పెద్దగా ప్రాచుర్యం పొందలేదు. తిరిగి 1999లో ట్రినిడాడ్ టొబాగోకు చెందిన డైరోమ్ టీలక్సింగ్ అనే వైద్యుడు పురుషుల దినోత్సవాన్ని పున:ప్రారంభించారు. అందుకోసం తన తండ్రి జన్మదినాన్ని (నవంబర్19) ఎంచుకున్నారు. దీనికి ఐక్యరాజ్యసమితి ఆమోదం కూడా లభించింది. 2007 నుంచి మన దేశంలోనూ పురుషుల దినోత్సవాన్ని జరుపు తున్నారు. అప్పట్లో ఈ వేడుకలను నిర్వహించడానికి 'సేవ్ ఇండియన్ ఫ్యామిలీ' (ఎస్ఐఎఫ్) ఎంతో కృషి చేసింది. మహిళా కమిషన్ లాగానే పురుషుల కమిషన్ కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించారు. భారతదేశం, యుఎస్ కె, యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, హంగేరి మొదలైన వాటితో సహా ప్రపంచంలోని 70 కంటే ఎక్కువ దేశాలు ప్రతి ఏడాది ఈ దినోత్సవాన్ని జరుపుకొంటాయి. పురుషులను గౌరవించేందుకు అంతర్జాతీయంగా పురుషుల దినోత్సవాన్ని జరుపుతారు. పురుషుల శ్రేయస్సు, ఆరోగ్యంపై అవగాహన పెంచడానికి, వారు చేసే పనిని గుర్తించి గౌరవించటానికి ఇది ఒక రోజు. మగవారికి ఆనందం. కుటుంబ కోసం జీవితాలను త్యాగం చేస్తున్న పురుషులందరికీ 'ఇంటర్నేషనల్ మెన్స్ డే' శుభాకాంక్షలు.



తునిలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి- కవిటి

ధనుంజయం (ఫైల్)

తునిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బెలగాంకు చెందిన జీరు ధనుంజయం (30) మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు గతకొంతకాలంగా ధనుంజయం తునిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై తన రూమ్‌కు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ధనుంజయకి తండ్రి కామేష్, తల్లి నీలమ్మ, భార్య లత, రెండేళ్ల పాప ఉన్నారు. ధనుంజయం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి.

యువతి అదృశ్యం

నందిగాం : మండలంలోని పెద్ద తామరపల్లికి చెందిన సవలాపురం శ్రావణి అదృశ్యమైనట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ సోమవారం తెలిపారు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిందన్నారు. ఆమె తల్లి దండ్రులు తన బంధువుల ఇళ్లల్లో వాకబు చేశారని, ఎప్పటికీ కనిపించకపోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసుదర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గాయపడిన క్షతగాత్రులు

ఐదుగురికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారిలో నిమ్మాడ కూడలి సమీపంలో సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. నరసన్నపేట మండలం కొమర్తికు చెందిన ఆటోడ్రైవర్ కొమర్తి రామారావుతో పాటు ప్రయానికులు దుర్గాన రాజేశ్వరి, గుమ్మడి మాణిక్యం, కొల్లి రాములమ్మ, కొల్లి గుణవతి, కొమనాపల్లి సరస్వతి సోమవారం టెక్కలి మండలం రావివలస ఎండలమల్లిఖార్జున స్వామి వారికి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో నిమ్మాడ సమీపంలోకి వచ్చే సరికి మతి స్థిమ్మితం లేని యాచకుడు ఆటోకు ఒక్కసారిగా ఎదురుగా రావడంతో డ్రైవర్ బ్రేక్ వేయడంతో బోల్తాపడడంతో ఈ ప్రమాదం సంభవించింది. వెంటనే ఎస్‌హెచ్ఐ సిబ్బంది క్షేతగాత్రులను నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

పాతపట్నం : మండలంలోని స్థానిక అంతర్రాష్ట్ర రోడ్డులో పాతపట్నం ఎక్సైజ్ సిఐ కృష్ణారావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో సోమవారం తనిఖీలు నిర్వహించారు. విక్రయించడానికి 8 మద్యం సీసాలు తరలిస్తూ వ్యక్తి పట్టుబడినట్టు సిఐ తెలిపారు. మద్యం సీసాల స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించిన, మద్యం, నాటుసారా విక్రయించినా, తరలించినా వారిపై నిఘా పెట్టామని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోకర్ణపల్లిలో నిర్వహిస్తున్న గ్రామసభ

గోకర్ణపల్లిలో గ్రామసభ

పొందూరు: మండలం గోకర్ణపల్లిలో సోమవారం ఉపాధిహామీ పథకం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి పనులు, కూలీలకు వంద రోజుల పనికల్పన వంటి పలు అంశాలకు సంబంధించి గ్రామసభలో ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ వెంకట రామరాజు, టెక్నికల్ అసిస్టెంట్ ఆర్.జగన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రిని కలిసిన ఎంజిఆర్

వినతిపత్రం అందజేస్తున్న ఎంజిఆర్

పాతపట్నం : నియోజక వర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వ భూములను కేటాయించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు సచివా యలంలో రెవెన్యూ, రిజిస్ట్రర్, స్టాండపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో జరిగిన అవినీతి, విలువైన ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని విన్నవించారు. అర్హులైన పేదవారికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

'104' సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఎఎంయు ఎంప్లాయీస్ యూనియన్ కోరారు. జనసేన నియోజవకర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఆర్. సురేష్ బాబు, ప్రెసిడెంట్ సిహెచ్.నారాయణ, జనరల్ సెక్రెటరీ డి.కిరణ్, ట్రెజరర్ ఎస్.నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీరువా వితరణ

పాతపట్నం: ఆదర్శ పాఠశాల పాతపట్నంలో పతో తరగతి చదువుతున్న వండాన హేమని, ఇంటర్మీడియట్ చదువుతున్న బూడిద భానుశ్రీ తల్లిదండ్రులు వండానా గంగాధర్, బూడిద నాగరాజులు ఆదర్శ పాఠశాల, బాలికల వసతిగృహానికి బీరువా వితరణగా అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, వార్డెన్ త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

బాహుదాపై ఛానల్‌ను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం బాహుదా నదిపై ఉన్న ఛానల్‌ను అభివృద్ధి చేయాలని టిడిపి నాయకులు దక్కత శ్రీను, దక్కత కామేశ్వరరావు, తులసయ్యరెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాహుదా ఛానల్ అభివృద్ధి లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. బాహుదా ఛానల్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని విన్నవించారు.

'అపార్' ఐడికి ఇబ్బందులు పెట్టొద్దు

ప్రజాశక్తి- పలాస

అపార్ ఐడికి ఇబ్బందులు పెట్టొద్దని, సచివాలయంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఎంపిడిఒ వసంత కుమార్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో, ఎన్ఆర్ఇజిఎస్, పంచాయతీరాజ్, ఐసిడిఎస్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాంపై దృష్టిసారించాలన్నారు. పూర్తి చేసిన రోడ్ల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణాలకు బిల్లులు వస్తాయని, ఎవరూ అపోహ పడవద్దని సూచించారు. ఈనెల 22న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పలాసలో పర్యటిస్తారని, పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డిఇ రవిబాబు, వ్యవసాయ శాఖ ఎఒ పోలారావు, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

అభినందనలు తెలుపుతున్న ఎంఇఒలు

ఉపాధ్యాయునికి అభినందనలు

ప్రజాశక్తి- కొత్తూరు

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తూ, పాఠశాల ప్రగతికి కృషి చేస్తూ, అదనపు సమయాల్లో విద్య, సామాజిక, సాహిత్య, కళా, సేవా రంగాల్లో గణనీయమైన సేవలు ఉపాధ్యాయులు కుదమ తిరుమలరావు అందిస్తున్నారు. ఈ మేరకు ఎంఇఒ చందక గోవింద, నిమ్మల శ్రీనివాసరావులు సోమవారం రిసోర్స్ సెంటర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగు, గురజాడ, సర్వేపల్లి, నెహ్రూ జయంతి, విజయనగరం ఉత్సవాల్లో స్వీయ కవితా గీతాలతో పలు సత్కారాలు, పురస్కారాలు పొందడం అందరికీ గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. తిరుమలరావు జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొల్ల రాజేష్, పప్పల ఐశ్వర్య, పసుపురెడ్డి స్వప్న, కలగాటి అప్పలనాయుడు, అగతముడి గోవిందరావు, గులుమూరు శంకరరావు, పొత్రకుండ నాగభూషణరావు, అల్లక హిమబిందు, నగిరికటకం వెంకటరావు, నిమ్మక రామారావు, పెయ్యల సుజాత, చీర సంతోషి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తవలసలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. అలాగే ఎటిఎంల వద్ద గుర్తు తెలియని వ్యక్తులకు ఎటిఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయమని కోర వద్దని సూచించారు. గుర్తింపు లేని వ్యక్తులు నిర్వహించే చిట్ ఫండ్‌లలో చిట్స్ కట్టి మోసాలకు గురి కావద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బిఆర్ఎయుని అభివృద్ధి చేయాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు

ప్రజాశక్తి- పలాస

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

అంబేద్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.వంద కోట్లు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో ఎఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు సోమవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో కలిసి పలాస-కాశీబుగ్గ కేటి రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం పేదలకు విద్య అందని ద్రాక్షలా తయారైందన్నారు. ఇప్పటికే రేషలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను హైస్కూల్‌లో విలీనం చేశారని అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీల్లో జాతీయ విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీట్ల సంఖ్యను కుదించి వేయడం వల్ల ఉన్నత విద్య మరింత ఖరీదుగా తయారవుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో జిఒ నంబరు 77ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటపై నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సాంఘిక సంక్షేమ గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. పెండింగ్ లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలని కోరారు. విద్య ప్రయివేటీకరణకు, కార్పొరేటీకరణకు, కాషాయీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలకు సన్నద్ధమవుతున్నామని ప్రభుత్వాలకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ముద్దాడ యుగంధర్, జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి, ఎఐఎస్ఎఫ్ నాయకులు రాము సూర్య, విజయ్, గుణశేఖర్, చిరు, హరిప్రసాద్, మహేష్, సాయి, శ్యామ్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన ఈ నెల 26న నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలరమ ప్రభాకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ కూడలిలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధ్యం కాని, ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికలు చేపట్టడానికి బిజెపి ప్రభుత్వం చేపడుతున్న కుయుక్తులని పేర్కొన్నారు. బిజెపి మతోన్మాద పార్టీలను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిటిఎఫ్ గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, ఎఐటియుసి నాయకులు అనపాన షణ్ముఖరావు, లక్కోజి కేశవ రావు, వెంకటరావు, తులసి, ఇందిరమ్మ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న తిలక్

తిలక్ పరామర్శ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో వైసిపి కార్యకర్తలు జనసేన కార్యాలయంపై దాడి కేసులో పోలీసులు 41 నోటీసులు ఆదివారం అందజేశారు. విషయం తెలుసుకున్న వైసిపి కార్యకర్తలను టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలపై ఉద్యేశపూర్వకంగా కేసు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలపై కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి నడిపూరి శ్రీరామ్మూర్తి, బమ్మిడి తులసజీరావు, షాబతో, కర్ణిక జీవన్, ఆట్ల రాహుల్ కుమార్, దాసరి మదిన్, బెండి ఉదయ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్న హామీలు అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు కోరారు. నరసన్నపేట, జమ్ము సచివాలయాల కార్యదర్శులకు సోమవారం వినతిపత్రులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్, ఇసుక, ఐరన్ వంటివి ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎన్.నారాయణరావు, ఎన్.మధు, భాస్కరరావు పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి రూరల్ : తరలివచ్చిన యాత్రికులు

కార్తకమాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని రావివలసలో ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయానికి యాత్రికులు వేకువజాము నుంచే తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచీ యాత్రికులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అలయ కార్యనిర్వాహణాధికారి గురునాథరావు, సిఐ అంబటి విజయకుమార్ పరివేక్షించారు. టిడిపి నాయకులు ఎల్.ఎల్.నాయుడు, మాజీ సర్పంచ్ బడే జగదీశ్వరరావు ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే టెక్కలి పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, ఉమామహేశ్వరస్వామి, కాశీవిశ్వేస్వరస్వామి ఆలయాలకు యాత్రికులు తరలివచ్చారు.

నందిగాం : నందిగాంలోని అగస్తీశ్వర, నర్సిపురంలో శివాలయం, గోవిందపురంలో ఉమాకామేశ్వరాలయం, హరిదాసుపురంలో చంద్రశేఖర స్వామి, కొత్తగ్రహారంలోని శివాలయాలు ఉదయం 5 గంటల నుంచే యాత్రికులు తరలివచ్చారు. పలుచోట్ల అన్నదానం నిర్వహించారు.

కోటబొమ్మాళి : స్థానిక ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కార్య నిర్వహాధికారి వాకచర్ల రాధాకృష్ణ, కొత్తపేటలోని శివకేశవ పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకులు బి.గౌరీశంకరశర్మ ఆధ్వర్యాన సుబ్బరావుపేట, చవితిపేట, చిట్టేవలస, దంత, లఖందిడ్డి, కురుడు, లఖందిడ్డి, హరిశ్చంద్రపురం ఆలయాలు కిటకిటలాడాయి.

రణస్థలం రూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

కంబాలపేటలో అన్నదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా బంటుపల్లి పంచాయతీ కంబాలపేట శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయ సన్నిధి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తనయుడు తేజబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నడుకుదిటి రజని, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, కోష్ట మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు, కమిటీసభ్యులు వెలిచేటి సురేష్ కుమార్, రాయుడు, సుధాకర్ కుమార్, రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని ఒవిపేటలో మూడవ సోమవారం సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాత్రికులకు ప్రసాదం, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కొంచాడ అనిల్, నరస నాయుడు, సురేష్, కిరణ్, గోవిందు, తరుణ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కళాకారునికి సన్మానం

ప్రజాశక్తి- కవిటి

సన్మానిస్తున్న గ్రామస్తులు

మండలంలోని టి.బరంపురానికి చెందిన తిప్పన ధనుంజయరెడ్డి 25 ఏళ్ల నుంచి కళలని ప్రోత్సహిస్తూ, కళాకారులను ఆదరిస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్ అన్నారు. మండలంలోని కపాసుకుద్దిలోని రామలింగేశ్వర ఆలయంలో సోమవారం ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధనుంజయ రెడ్డి పాండురంగ భజన, కోలాటం, జానపదాలు, వయోలిన్, కీబోర్డ్, హార్మోనియం, గాత్రం వంటి అనేక రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తూ కళారంగానికి సేవచేస్తున్నారని కొనియాడారు. ఎంతోమంది యువ కళాకారులను తయారు చేసిన ఘనత ధనుంజయ రెడ్డిదని అన్నారు. కార్యక్రమంలో పెద్దలు తోట ధర్మరాజు, చెలపరాయి ఏకాంబరం, కూర్మారావు, ఆలయ అర్చకులు నిరంజన్‌స్వామి, శంకర్‌స్వామి, తోట రామారావు, చిట్టిబాబు, దాసు, చెలపరాయి వినోద్ కుమార్, పొందల శ్రీనివాస్, జయదేవ్, గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాని రైతో

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

పర్లాకిమిడి : రైతులు పండించిన పంటలకు మద్దతు కల్పించాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాణి రైతో, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య తెలిపారు. గజపతి జిల్లా పర్లాకిమిడి సిపిఎం కార్యాలయంలో వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి ధర్నా సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త బస్టాండ్ నుంచి కాలేజీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ధర్నాకు రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కేదార్ సబర్, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జూన్ గోమాంగో, ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం, సిపిఐ జిల్లా నాయకులు జొన్న సుభాష్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు పైల మురళి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి- పలాస

ఉత్తరాంధ్రకు తలమానికమైన విశాఖ ఉక్కును ప్రయివేటీకరించాలని కేంద్రం ప్రతిపాదించడం, దానిని నాటి వైసిపి, ప్రస్తుతం టిడిపి కూటమి వత్తాసు పలకడం ప్రజలను మోసం చేయడమేనని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ జిల్లా అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు దుయ్యబట్టారు. ఈ మేరకు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యాన పలు ప్రజా సంఘాల మద్దతో పోస్టుకార్డు ఉద్యమానికి సంబంధించి పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు అభివృద్ధికి రూ.ది వేల కోట్లు తక్షణసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దానేష్, కె.బాలకృష్ణ, మద్దిల రామారావు, ఢిల్లీరావు, నీలకంఠం పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆయుష్ వైద్యం ఆరోగ్యకరం

కోటబొమ్మాళి: ఆయుష్ వైద్యం వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని ఈ వైద్య విధానాల వల్ల ఎటువంటి అదనపు ఇబ్బందులు ఉండవని, ముఖ్యంగా మధుమేహ నియంత్రణకు వైద్య విధానంలో మంచి మందులు ఉన్నాయని మండలం కొత్తపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ వరుణ్, డాక్టర్ గురుమూర్తిలు అన్నారు. సోమవారం జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యాన కొత్తపల్లి పిహెచ్‌సి అవరణలో ఆశాకార్యకర్తలకు ఆయుష్ వైద్యసేవలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఆయుష్ వైద్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కింతలి హోమియో వైద్యాధికారి డాక్టర్ పి.పద్మజ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తో విజయ, సాయిరాజ్

జగన్‌ను కలిసిన జెడ్‌పి ఛైర్‌పర్సన్

ఇచ్ఛాపురం : మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కలిశారు. విజయవాడలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైసిపి ఓటమి తరువాత కలిసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు.

టిడిపి సభ్యత్వాల నమోదు

ఆమదాలవలస : మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు మెట్టక్కివలస హడ్కో కాలనీలో టిడిపి ఇన్‌ఛార్జి నాగళ్ల మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వాలు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. మెట్టెక్కి వలస ఏరియా టిడిపి ఇన్‌ఛార్జి ఎన్ని శ్రీదేవి, సిబిఎన్ ఆర్మీ ప్రతినిధి పైడి వసంతరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సాయం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి కాపువీధిలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలు వారు నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన గ్రామానికి చేరుకుని తక్షణ సాయంగా కిచెన్ సెట్లు, టార్పాలిన్లు, దోమతెరలు, చీరలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, బి.చిన్మయిరావు, టిడిపి నాయకులు ఉంగటి రమణ, విఆర్ఒ లీలా ప్రసన్న, గొలివి రమణ, రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ ఉమాశంకర్, వెంకట రమణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

సామగ్రిని అందజేస్తున్న మల్లేశ్వరరావు